క్లుప్తంగా

నేటి నుంచి మాక్ పాలీసెట్ పరీక్షలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, స్నేహిత అమృతహస్తం సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నుంచి మాక్ పాలీసెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు సేవా సమితి అధ్యక్షుడు రాజు ఒక ప్రకటనలో తెలిపారు. పాలీసెట్ ప్రవేశ పరీక్షల కొరకు పులివెందుల ప్రాంత పేద విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా ఉచిత విద్య ఉపాధ్యాయ సహకారంతో ఉచిత శిక్షణ కేంద్రంలో మాక్ పాలీసెట్ పరీక్షలు ఉంటాయని.. ఈ అవకాశాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రారంభమైన ఆరాధనోత్సవాలు

సింహాద్రిపురం : మండల పరిధిలోని అంకాలమ్మగూడూరు గ్రామంలో బ్రహ్మంగారి 19వ ఆరాధనోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఆరాధన ఉత్సవాలలో భాగంగా ఉదయం ప్రాతఃకాల పూజ, గోపూజలతో ప్రారంభించారు. అలాగే సోమవారం స్వామివారికి ప్రత్యేకపూజలతోపాటు మధ్యాహ్నం నుంచి అన్నదాన కార్యక్రమం, రాత్రి తాళాల భజనలతోపాటు బ్రహ్మంగారి జీవిత చరిత్ర నాటక ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ


సదాశివారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చెన్నూరు : మండలంలోని రామనపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సదాశివరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఆదివారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మాసీమబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

3 నుంచి బ్రహ్మోత్సవాలు

కమలాపురం : మండల పరిధిలోని రామాపురంలో నిత్య కల్యాణ మూర్తులుగా వెలిసిన శ్రీమహాలక్ష్మి సమేత మోక్ష నారాయణస్వామి, శ్రీ వల్లిదేవసేన సమేత ద్వికందర షణ్ముఖ సుబ్రమణ్యస్వామి వార్ల బ్రహ్మోత్సవాలు ఈనెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. అలాగే 7వ తేదీన పాల పండ్లు కలిగిన వృషభ రాజములచే బండ లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాత్రి జబర్దస్త్, శ్రీదేవి డ్రామా కంపెనీ చేసిన టీవీ, సీనీ కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

జేఎన్‌టీయూ విద్యార్థుల వితరణ

పులివెందుల రూరల్ : పట్టణంలోని జేఎన్‌టీయూ కళాశాలలోని హెల్పింగ్ హ్యాండ్స్ ద్వారా విద్యార్థులు ఆదివారం దీనబంధు ఆశ్రమానికి ఒక నెలవరకు సరిపడా అల్పాహారపు ఖర్చులకు గాను డబ్బులను వితరణగా అందించారు. హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో జెఎన్‌టీయూ కళాశాలలో క్లీన్అండ్ గ్రీన్, ఫుట్‌బాల్ గ్రౌండ్స్‌ను హెల్పింగ్ హ్యాండ్స్ విద్యార్థులు శుభ్రపరిచారు. ఇటువంటి మంచి కార్యక్రమాలు చేస్తున్న విద్యార్థులు ప్రిన్సిపాల్ వసుంధర, వైస్ ప్రిన్సిపాల్ రమణారెడ్డిలు అభినందించారు. విద్యార్థి దశలోనే ఇలాంటి సేవా కార్యక్రమాలను అలవరుచుకోవడం ఎంతో మంచిదని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు పారితోషికం

ఎర్రగుంట్ల : ఇంటర్ పరీక్ష ఫలితాలలో ప్రతిభ కనపరచిన వల్లెపు కేశవప్రియ(ఎంపీసీ), ఎస్.మెహబూబ్ (బైపీసీ) విద్యార్థులు 1000 మార్కులకు 960 మార్కులు సాధించి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ స్థానంలో నిలిచారు. వీరికి మానవత స్వచ్ఛంద సేవ సంస్థ ఒక్కొక్కరికి రూ.5 వేలు నగదును అందజేశారు. రిటైర్డు ఇన్‌స్పెక్టర్ విజయరాజు మానవత స్వచ్ఛంద సేవ సంస్థకు రూ.20 వేలు అందించారని మానవత చైర్మన్ రఘురామిరెడ్డి తెలిపారు.

ఘనంగా పెద్దమ్మ దేవర

జమ్మలమడుగు రూరల్ : మండలంలోని నర్సోజికొట్టాల గ్రామంలో పెద్దమ్మ దేవరను ఘనంగా నిర్వహించారు. ఆదివారం అమ్మవారిని ప్రత్యేకంగా అలకరించి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు బోనాలు సమర్పించారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు విద్యుత్ అంతరాయం

కమలాపురం : పట్టణంలోని పలు ప్రాంతాలలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ చాంద్‌బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చౌక్ సెంటర్ నుంచి గ్రామ చావడి వరకు ఉన్న పాత విద్యుత్ స్తంభాల నుంచి కొత్త విద్యుత్ స్తంభాలకు లైన్ మార్చుతుండటం వలన ఈ కోత ఉంటుందన్నారు. పాత స్టేట్ బ్యాంక్ నుంచి గ్రామ చావడి వరకు, అలాగే గిడ్డంగి వీధి, తెలుగువీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన తెలిపారు.

భారీగా తగ్గిన అరటి ధరలు.. ఆందోళనలో రైతులు

● టన్ను రూ.35వేల నుంచి రూ.8 వేలకు పడిన ధరలు


అరటి కాయలను లోడు చేస్తున్న కూలీలు(ఫైల్)

లింగాల : అరటి ధరలు భారీగా పడిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిన్న, మొన్నటి దాకా టన్ను అరటి కాయలు రూ.30వేల నుంచి రూ.35వేల దాకా ధర పలికింది. గత 10 రోజులనుంచి టన్ను రూ.8వేల నుంచి రూ.9వేల ధర పలుకుతోంది. అయినా వ్యాపారస్తులు కొనుగోలు చేసేందుకు ముందుకు రావడంలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. పులివెందుల ప్రాంతంలో పండించే అరటికి ఇతర రాష్ట్రాలతోపాటు విదేశాలలో కూడా మంచి డిమాండ్ ఉంది. నాణ్యతకు మారుపేరుగా నిలిచాయి. ధరలు ఒక్కసారిగా పడిపోవడంతో పంటలు సాగు చేసిన రైతులు ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఆడపా దడపా ఈదురు గాలులు వీస్తున్నాయని.. అకాల వర్షాలు కురిస్తే మరింత నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు భయాందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ధరలు నిలకడగా ఉండే విధంగా చూడాలన్నారు.

రూ.20 లక్షలు నష్టం :



అరటి ధరలు తగ్గిపోవడంతో రూ.20లక్షల దాకా నష్టపోయాను. తాను సాగు చేసిన 6 ఎకరాల అరటి పంటలో సుమారు 120 టన్నుల దాకా అరటి దిగుబడి వచ్చింది. అయితే అరటి ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో భారీగా నష్టపోయాం. టన్ను అరటి కాయలు రూ.7వేలతో విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– ఎం.చంద్రశేఖరరెడ్డి, లింగాల

రైతుల పరిస్థితి అయోమయంగా ఉంది :



ప్రస్తుతం అరటి ధరలు తగ్గడంతో రైతుల పరిస్థితి అయోమయంగా ఉంది. ఏ పంట సాగు చేయాలో.. ఏ పంటలకు ధరలు ఉంటాయో తెలియడం లేదు. నాకున్న 4 ఎకరాలలో అరటి పంట సాగు చేశాను. సుమారు 80 టన్నుల దిగుబడి వచ్చింది. ఒక్కసారిగా ధరలు తగ్గడంతో రూ.15లక్షల దాకా నష్టపోయాం. పెట్టుబడులు పెట్టే పరిస్థితి కూడా లేదు. ప్రభుత్వం ధరల స్థిరీకరణ ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.

– టి.లక్ష్మినారాయణరెడ్డి, లింగాల

పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు

– ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి


నవరత్నాల లబ్ధిని మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

పెద్దముడియం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం మండలంలోని సుద్దపల్లె గ్రామంలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ బ్రోచర్ అందించారు. ప్రతి నెలా 1వ తేదీ ఇంటికే ఫించన్ అందుతోందని, వైఎస్సార్ చేయూత, అమ్మఒడి తదితర పథకాలు అందుతున్నాయని, అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా నిలుస్తోందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు సిఫార్సు చేసిన వారికే పథకాలు అందేవన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీల కతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఇంకా అర్హత ఉండి సాంకేతిక కారణాలతో పథకాలు అందకపోతే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రజలకు సూచించారు. ప్రతి పేద వాడికి పక్కా గృహం ఉండాలన్న సంకల్పంతో జగనన్న కాలనీల పేరిట ఊర్లకు ఊర్లు వెలుస్తున్నాయన్నారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల అవినీతి వల్ల అర్హులైన ప్రజలకు న్యాయంగా అందాల్సిన సంక్షేమ పథకాలు వారికి చేరలేదన్నారు. కాని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ నవరత్నాల ద్వారా లబ్ధి చేకూరుతోందన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ వెంకట కొండారెడ్డి, నాయకులు ఎస్.సుధాకర్ రెడ్డి, మనోహర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, బాషా, శివలక్ష్మిరెడ్డి, బాల సుబ్బారెడ్డి, కోటిరెడ్డి, ఉపేంద్రారెడ్డి, మండలస్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంటు ప్రారంభం


మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేంపల్లె : అయ్యవారిపల్లె గ్రామంలో ప్రజలందరికీ శుద్ధి జలాన్ని అందించడమే లక్ష్యంగా రూ.8 లక్షల పాడా నిధులతో మినరల్‌వాటర్ ప్లాంటును ఏర్పాటు చేశారు. ఈ ప్లాంటును ఆదివారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రారంభించారు. ఒక బిందె నీటికి కేవలం రూ.5లకే అందిస్తున్నట్లు ప్లాంటు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మీగాయత్రి, మండల ఉపాధ్యక్షురాలు రమణమ్మ, సర్పంచ్‌లు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా ఎస్పీవై రెడ్డి వర్ధంతి


ఎస్పీవై రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీఎం, తదితరులు

పులివెందుల : పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న వికలాంగుల కార్యాలయంలో ఆదివారం ఏపీ దివ్యాంగుల నెట్‌వర్క్ ఆధ్వర్యంలో ఎస్పీవై రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఏపీఎం అంజనేయులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీవై రెడ్డి సేవా తత్పరతను ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలన్నారు. అనంతరం దివ్యాంగులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, వైఎస్సార్ సీపీ యూత్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, ఎస్సీ విభాగపు జనరల్ సెక్రటరీ రాజా తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులు విందుభోజనాలను ఆరగించారు.

3 నుంచి వార్షికోత్సవం

వల్లూరు : మండలంలోని దిగువపల్లె కొత్తపల్లెలో వెలసిన ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారి జయంతిని పురష్కరించుకుని ఆ లయ వార్షికోత్సవ వేడుకలను 3 వ తేదీ నుంచి రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 3న ఉదయం గణపతి పూజతో మొదలై రాత్రి సాసవల చిన్నమ్మ కథ ప్రదర్శన వుంటుంది. 4 న ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకంతో మొదలై స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. రాత్రి డీ కొత్తపల్లె, దిగువపల్లె, పెండ్లిమర్రి మండల పరిధిలోని ఎగువపల్లె గ్రామాల్లో స్వామి వారి గ్రామోత్సవం జరుగుతుంది. ఉత్సవాల్లో భాగంగా 3వ తేదీ ఉదయం 10 గంటలకు బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.30 వేలు, రెండవ బహుమతి రూ.25 వేలు, మూడవ బహుమతి రూ. 20 వేలు, నాలుగవ బహుమతి రూ.15 వేలు, ఐదవ బహుమతి రూ.10 వేలు, ఆరవ బహుమతి రూ.7,500, ఏడవ బహుమతి రూ.5 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

సీపీఐ నాయకుల నిరసన


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

కమలాపురం : కడపలో సీపీఐ నేతల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ కమలాపురంలోని క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడపలో సీపీఐ, సీపీఎం తలపెట్టిన ప్రచారభేరి సభకు అనుమతి ఇవ్వకుండా నిరసన కారులను పోలీస్‌స్టేషన్‌లోకి ఈడ్చుకెళ్లి కొట్టడం దారుణం అన్నారు. పోలీసులు తీరు మార్చుకోక పోతే ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి చంద్రశేఖర్, మండల కార్యదర్శి నాగేశ్వరరావు, ఏరియా కార్యవర్గ సభ్యులు రామ్మోహన్‌రెడ్డి, సుబ్బయ్య, ఎంఆర్‌పీఎస్ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణం

పులివెందుల రూరల్ : మండలంలోని పుత్రాయునిపేట గ్రామంలో వెలసిన శ్రీపుట్ట వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలను కమిటీ సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామునుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీపుట్ట వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. బాణా సంచా పేలుళ్ల మధ్య దేవదేవుని గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా వాసవీ కన్యకాపరమేశ్వరీ జయంతి


అమ్మవారి కళశాన్ని ఊరేగిస్తున్న మహిళలు

వల్లూరు : స్థానిక అమ్మవారిశాలలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి జయంతి మహోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి వాసవీ సహస్ర నామార్చనతో పాటు విశేష పూజలను నిర్వహించారు. అనంతరం మహిళలు అమ్మవారి కళశాన్ని మోస్తూ మంగళ వాయిద్యాలతో పుర వీధుల గుండా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ కార్యక్రమం జరిగింది. ఆర్య వైశ్య పెద్దలు పాల్గొన్నారు.

వేంపల్లిలో..

వేంపల్లె : పట్టణంలో వెలసిన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి జయంతి సందర్భంగా జయంతోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాజారావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ప్రసాద్ శర్మ వాసవీమాతకు అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. మహిళలు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు, ఆవోపా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలను స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి సామూహిక పూజలు చేశారు. అలాగే వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి సందర్భంగా స్థానిక బ్రహ్మంగారి మఠంలో ఆదివారం భక్తులు ఘనంగా పూజలు చేశారు. అన్నదానం నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.

అంగన్‌వాడీ ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కమలాపురం : కమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని వల్లూరు, వీఎన్‌పల్లె మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్ల, హెల్పర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ సుమామణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఎన్‌పల్లె మండలం, అంకిరెడ్డిపల్లె కార్యకర్త పోస్టు ఎస్‌టీ కేటగిరికి, ఏ.ఓబాయపల్లె హెల్పర్ ఓసీఓహెచ్‌కు, ఉరుటూరు–1 హెల్పర్ బీసీ–సీకి కేటాయించారు. వల్లూరు మండలంలో చిన్నపుత్త హెల్పర్ పోస్టు ఓసీకి, కేబిజే నగర్ హెల్పర్ పోస్టు ఎస్సీకి కేటాయించామన్నారు. అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె అందులో తెలిపారు. వివాహం అయి స్థానికంగా ఉండే మహిళలు దరఖాస్తుతో పాటు విద్యార్హత, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం జతచేసి మే 3వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు. 9వ తేదీన కడప ఆర్‌డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ఆమె తెలిపారు.

ఘనంగా పాఠశాల స్నాతకోత్సవం


సర్టిఫికెట్లతో విద్యార్థులు

వేంపల్లె : పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.ఎఫ్.బాషా ఆధ్వర్యంలో స్నాతకోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పిల్లలకు తల్లిదండ్రులు మొదటి గురువులు అని.. పిల్లల అభివృద్ధి, విద్య సాధనలో కీలక పాత్ర పోషించాలన్నారు. మరింత శ్రద్ధ చూపుతూ అన్ని రంగాలలో విద్యార్థులను ఉన్నత స్థానాలలో ఉంచడమే తమ లక్ష్యమన్నారు. అనంతరం విద్యార్థుల స్నాతకోత్సవ సర్టిఫికెట్లతో ఉపాధ్యాయులు గ్రూప్ ఫొటోలు దిగారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ అన్వరుల్ హక్, ప్రిన్సిపాల్ ముబీనా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జలమయమైన రహదారి


జలమయంగా మారిన రైల్వేస్టేషన్ రహదారి

ముద్దనూరు : కొద్దిపాటి వర్షం కురిస్తే చాలు స్థానిక రైల్వేస్టేషన్ ప్రధాన రహదారి జలమయంగా మారుతోంది. ప్రయాణికులు రైల్వేస్టేషన్‌కు వెవెళ్ళాలంటే తీవ్ర అవస్థలు ఎదుర్కోవాల్సిన దుస్థితి నెలకొంది. స్థానిక పాతబస్టాండు ఆవరణ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్ళే ఏకైక రహదారి నీటితో నిండిపోతుంది. తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట వేడుకలు


కోదండ రామాలయం

లింగాల : మండలంలోని దిగువలింగాల గ్రామంలో ఎండోమెంట్, గ్రామస్తుల సహాయ సహకారాలతో సుమారు రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన శ్రీకోదండ రామాలయంలో నూతన దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ట వేడుకలలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. సోమవారం వివిధ పూజలతో మొదలై బుధవారం ఉదయం 6.35 గంటలకు యంత్ర ప్రతిష్ట, ధ్వజ శిఖర కలశప్రతిష్ట, ప్రాణప్రతిష్ట మూలమూర్తి కలశ హోమాలు, మహా పూర్ణాహుతి, గ్రామదేవత పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు, ఉదయం 10 గంటల నుంచి శ్రీసీతారాముల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఈ మూడు రోజులపాటు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బండలాగుడు పోటీల్లో మొదటి బహుమతి రూ.80 వేలు, ద్వితీయ బహుమతి రూ.50వేలు, తృతీయ బహుమతి రూ.35వేలు, నాల్గవ బహుమతి రూ.15 వేలు, 5వ బహుమతి రూ.10వేలు అందించనున్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని మూలవంక గ్రామంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. స్వామి వారికి పంచామృతాభిషేకంతో పాటు ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. అనంతరం కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం

సింహాద్రిపురం : మండలంలోని రావులకొలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పైడిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల్లో ఆదివారం ఉత్తమ ఉపాధ్యాయ సముదాయ చైర్ పర్సన్ అనురాధ అధ్యక్షతన ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులైన జయరామకృష్ణుడు, చంద్ర సుధాకర్‌రెడ్డిలను సత్కరించి మెమెంటోలను అందించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం


పులివెందుల : అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

పులివెందుల రూరల్ : పట్టణంలోని పార్నపల్లె రోడ్డు సమీంపలో ఉన్న గోపి విహార్ ఫంక్షన్ హాలులో పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం జరిగింది. తొండూరు మండలం గోటూరు ఆర్‌సీఎం పాఠశాలలో 1993–97వ వరకు చదువుకున్న పూర్వపు విద్యార్థులందరూ కలిసి సమావేశాన్ని నిర్వహించుకున్నారు. అప్పటి గురువులు రాఘవరెడ్డి, ఆదిరెడ్డి, జానకిలను ఘనంగా సత్కరించారు.

కొండాపురంలో..

కొండాపురం : స్థానిక జెడ్పీ ఉన్నతపాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి ఎం.ఓబులేసు, స్థానిక ప్రధానోపాధ్యాయుడు రామయ్యలు హాజరై మాట్లాడారు. 1988లో పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొని తమ భావాలను పంచుకున్నారు. అప్పటి గురువులు సోమకృష్ణారెడ్డి, విజయలక్ష్మి, సుబ్బారెడ్డి, ప్రమీల, వెంకటేశ్వర్లు, గోపాల్‌రెడ్డిలను ఘనంగా సత్కరించారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో 1985 సంవత్సరం పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. నాటి విద్యార్థిగా ఉన్న కొండాపురం ఎంఈఓ ఓబులేసు మాట్లాడుతూ వివిధ ప్రాంతాల్లో స్థిరపడి ఒకే చోట కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కేవీ రమణ, గురప్ప, జిల్లా పారామెడికల్ అధికారి సింగరయ్య, రామమోహన్, వెంకట్రామిరెడ్డి, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.


కొండాపురం : నాటి గురువులతో పూర్వ విద్యార్థులు


జమ్మలమడుగు : పూర్వ విద్యార్థులు